## క్లుప్తంగా

### వేడుకగా మదన గోపాలస్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ఆకివీడు: మండలంలోని అయిభీమవరంలో రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి కల్యాణోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణంలో స్థానికులు రుద్రరాజు అర్జునరాజు దంపతులు పాల్గొని పూజలు చేశారు. కల్యాణోత్సవాన్ని భక్తులు తిలకించారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా మహా శివుడికి స్థానిక మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో, మాదివాడలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో, పిల్లలమర్రి అగ్రహారంలోని వేంకట లింగేశ్వరస్వామి ఆలయంలో, భీమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు చేశారు.

### ముగిసిన వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



పూర్ణాహుతి సమర్పిస్తున్న భక్తులు

భీమవరం(ప్రకాశంచౌక్): జేపీ రోడ్డులోని శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిశాయి. సోమవారం సాయంత్రం ఆలయ చైర్మన్ మంతెన రామ్ కుమార్‌రాజు, కాకులపాటి వీర రాఘవరావు దంపతులచే స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం వేద మంత్రాలతో ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు పండితులు సాంప్రదాయ బద్ధంగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 17న శనివారం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు.

### వేంకటేశ్వర స్వామికి పుష్పయాగోత్సవం



వేంకటేశ్వర స్వామికి పుష్ప యాగోత్సవం నిర్వహిస్తున్న పండితులు

భీమవరం(ప్రకాశంచౌక్): శ్రీవేంకటేశ్వర స్వామికి పలు రకాల పుష్పాలతో పుష్పయాగోత్సవం నిర్వహించారు. జేపీ రోడ్డులోని శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు, చైర్మన్ మంతెన రామ్ కుమార్‌రాజు, భక్తులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం: స్థానిక నరసయ్య అగ్రహారంలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్, డివైడర్ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం మున్సిపాలిటీ 5వ వార్డు కుముదవల్లి రోడ్డులో ఆర్టీసీ డిపో అవుట్ గేట్ నుంచి సుమారు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ మన్నే సతీష్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ రవితేజ, ఎలక్ట్రికల్ ఏఈ పద్మావతి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కలిదిండి వినోద్ వర్మ,నార్ని తాతాజీ, అడబాలశివ, షేక్ మొహుద్దీన్, జనార్ధన్, వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

### గోదావరికి పంచ హారతులు

పెనుగొండ: పౌర్ణమి సందర్భంగా హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం వశిష్ట గోదావరికి పంచహారతులు ఇచ్చారు. సిద్ధాంతం కేదారీ ఘాట్‌లో సోమవారం రాత్రి కలగభద్రుడు స్వామి అర్చకత్వంలో ఏకముఖ, ద్విముఖ, చతుర్ధ, పంచమ, కుంభ, నక్షత్ర, పూర్ణ కుంభ, సర్ప హారాతులిచ్చారు. తొలుత గంగా పూజలు చేశారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పింఛన్లు ఎండమావేనా?

- వితంతువులకూ తప్పని తప్పలు
- ఏడాదిన్నర నుంచి అర్హుల ఎదురు చూపులు
- సెటైర్లు కొడుతున్న సైట్‌లు



పింఛన్లను పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

ఆకివీడు: కొత్త పింఛన్ల మంజూరు ఎండమావిగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపుగా ఏడాది కావస్తున్నప్పటికీ కొత్త ఫించన్ల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ లభించలేదు. కొత్త పింఛన్ల కోసం అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, కళాకారులు, ఇతర సామాజిక రంగాల్లోని వ్యక్తులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటే ప్రభుత్వం ఆన్‌లైన్ సైట్ మాత్రం ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రిత్వ శాఖల చుట్టూ చక్కెర్లు కొడుతుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్త పింఛన్ ఒక్కటీ మంజూరు కాకపోవడంతో అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి ఏటా జనవరి, జూలై నెలల్లో కొత్త పింఛన్లను మంజూరు చేసి, పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా కొత్త పింఛన్లకు అవకాశం లేకపోవడంతో అర్హులైన లబ్ధిదారులు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు.

**భర్త చనిపోతే వితంతు పింఛన్**

కూటమి ప్రభుత్వం వితంతు పింఛన్‌కు నిబంధనలు ఏర్పాటు చేసింది. కొత్తగా వితంతు పింఛన్ మంజూరుకు వృద్ధాప్య పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే ఆ మహిళకు వితంతు పింఛన్ ఇస్తామని ప్రకటించడం దారుణమని పలువురు వాపోతున్నారు. అది కూడా డిసెంబర్ 1, 2023 నుంచి అక్టోబర్ 31, 2024 మధ్య చనిపోయిన వారికేనని ఉత్తర్వులు జారీ చేయడం విడ్డూరంగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ విధమైన పింఛన్ పొందని వ్యక్తి చనిపోతే అతడి భార్య(వితంతు)కు పింఛన్ మంజూరు చేయరా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం డొంకతిరుగుడు విధానాలను అవలంబిస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలాల్లో వేళ్లపై లెక్కించగలిగే వితంతు పింఛన్లకు ఇటువంటి నిబంధన పెట్టడం ప్రభుత్వ అసమర్ధ విధానాలకు నిదర్శనంగా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. వితంతువుగా ఉన్న ప్రతి వ్యక్తికీ పింఛన్ మంజూరు చేసే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతున్నారు.

**దరఖాస్తుకూ ఇక్కట్లే**

కొత్త వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయానికి వెళ్లిన మహిళలకు ఇక్కట్లు తప్పడం లేదు. డిజిటల్ అసిస్టెంట్ అందుబాటులో లేకపోవడంతో దరఖాస్తును ఆన్‌లైన్ చేసే నాథుడు లేడు. డిజిటల్ అసిస్టెంట్‌కు మరో రెండు గ్రామాల్లో ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో ఆయన ఏ గ్రామంలో ఉన్నారో తెలియక దరఖాస్తుదారులు పడిగాపులు పడాల్సి వస్తుంది. తీరా డిజిటల్ అసిస్టెంట్ వచ్చినా ఆన్‌లైన్ దరఖాస్తు చేసేందుకు సర్వర్ సహకరించడం లేదు. దీంతో వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

**ఎన్నికల వాగ్దానాలు గాలికి**

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్నికల వాగ్ధానాల్లో పింఛన్ రూ.3 వేల నుంచి రూ.4 వేలు చేస్తామన్న హామీని మాత్రం నెరవేర్చినా, ఇతర అర్హులకు మాత్రం మొండి చెయ్యి చూపించారు. 50 ఏళ్లకే బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు ఫించన్ ఇస్తామన్న హామీని నేటికీ అమలుజేయలేదు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది సమీపిస్తున్నా 50 ఏళ్లకు పింఛన్ ఊసే ఎత్తడం లేదు.

**విసుగు చెందిన అర్హులు**

కొత్త పింఛన్ కోసం దరఖాస్తులు చేసుకుని, చివరకు విసుగు చెందారు. స్పందన, గ్రీవెన్స్ సెల్‌లో జిరాక్స్ కాపీలతో పాటు ఫొటోలు జతచేసి, చేసుకున్న దరఖాస్తులకు చేసిన సొమ్ము వృథా అవుతుందని విసుగు చెంది దరఖాస్తులు చేసుకోవడమే మానివేశామని పలువురు చెబుతున్నారు.

**నియోజకవర్గంలో**

| | పింఛన్‌దారులు | పింఛన్ సొమ్ము (కోట్లు) |
|---|---|---|
| పాలకోడేరు | 9082 | 3.78 |
| కాళ్ల | 8652 | 3.72 |
| ఉండి | 8656 | 3.65 |
| ఆకివీడు | 5300 | 23.00 |
| ఆకివీడు టౌన్ | 3161 | 01.37 |

### అర్హులకు పింఛన్లు ఇవ్వాలి



అర్హులకు పింఛన్లు ఇవ్వాలి. కొత్త ఫించన్ల కోసం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, కళాకారులు, పలువురు సామాజిక వేత్తలు అర్హత కలిగిన వారికి పింఛన్ మంజూరుకు వెంటనే సైట్ ఓపెన్ చేయాలి. పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే భార్య (వితంతువు)కు మాత్రమే ఇస్తాననడం సరైన విధానం కాదు. ప్రభుత్వం పునరాలోచించాలి.

–డోకలి లక్ష్మి, ఆకివీడు

### కొత్త పింఛన్లు ఎగ్గొట్టడానికే



కొత్త ఫించన్ మంజూరుకు పాత విధానాన్ని అమలు చేయాలి. పింఛన్ పొందుతున్న భర్త చనిపోతేనే భార్య (వితంతువు)కు ఇస్తాననడం తుగ్లక్ విధానమే. అర్హులకు కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం వెంటనే సైట్ ప్రారంభించాలి. ఫించన్లను ఎగ్గొట్టడానికి ఇటువంటి విధానాలు ఉపయోగపడతాయి. ప్రతి ఆరు నెలలకోసారి కొత్త పింఛన్లు మంజూరు చేయాలి.

–భైరి కల్యాణి, ఆకివీడు

### అలరిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు



విద్యార్థులకు కథలు వినిపిస్తున్న గంథాలయాధికారి

ఆకివీడు: వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞాన వేదికగా స్థానిక శాఖా గ్రంథాలయం ఉంది. గత కొన్ని రోజులుగా శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. సోమవారం విద్యార్థులకు విజ్ఞానాన్ని అందజేసే కథలను, కృత్యాధార బోధనను తెలిపారు. క్విజ్, జనరల్ నాలెడ్జ్, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రీడర్స్‌ఫోరం అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, అంథ ఉపాధ్యాయులు కిషోర్, శాఖా గ్రంథాలయ కార్యదర్శి పార్వతి పాల్గొన్నారు.

### సుబ్బారాయుడి గుడి నిర్మాణానికి విరాళం

భీమవరం: పట్టణంలోని శ్రీరామలింగేశ్వర స్వామి (సుబ్బారాయుడి గుడి) దేవస్థానానికి సోమవారం దాతలు రూ.2,02,141 విరాళంగా ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) చేతుల మీదుగా దేవస్థాన పునః నిర్మాణ కమిటీకి అందించారు. పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ పెన్మెత్స శ్రీధర్‌రాజు, శ్రీలక్ష్మి దంపతులు రూ.1,02,025, చెనమల్ల చంద్రశేఖర్, శివమంజూష దంపతులు రూ.1,00,116 విరాళంగా అందించారు. కార్యక్రమంలో పొత్తూరి బాపిరాజు, కారుమూరి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మకు వందనం



అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

వీరవాసరం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీఓ టి.లక్ష్మీకాంతం మాట్లాడుతూ తల్లి మీద, పెద్దల పట్ల గౌరవం కలిగి ఉండాలని వివరించారు. చక్కగా చదువుతూ క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం పిల్లలచే తల్లుల పాదాలకు నమస్కారం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

### ఘనంగా చండీహోమం



అమ్మవారి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

భీమవరం(ప్రకాశంచౌక్): వైశాఖ పౌర్ణమి సందర్భంగా శ్రీమావుళ్లమ్మ దేవస్థానంలో సోమవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ, వేదపారాయణం నిర్వహించారు. 58 మంది దంపతులు ఈ హోమంలో పాల్గొన్నారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీనగేష్ తెలిపారు.

# సమ్మెను జయప్రదం చేయాలి

వీరవాసరం: ఉద్యోగ కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్లను రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పలు ఉద్యోగ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. వీరవాసరంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడారు.ఉద్యోగులను కార్మికులను సంఘాలు పెట్టనివ్వకుండా వారి సమస్యలపై మాట్లాడనివ్వకుండా చేయడానికి లేబర్ కోడ్లను కేంద్ర పాలకులు తీసుకొచ్చారన్నారు. పోరాడి సాధించుకున్న చట్టాలే మాకు కావాలని వాటిని కట్టుదిట్టంగా అమలు చేయాలని దేశ వ్యాప్తంగా 20వ తేదీన సమ్మె నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నాయకులు సత్యవతి, వివో ఏ సంఘం నాయకులు భవాని, మిడ్ డే మీల్ కార్మిక సంఘం నాయకులు మద్దాల శ్రీనివాస్, మల్లుల ఏసుబాబు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



వీరవాసరం: సమ్మె వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు



భీమవరం అర్బన్: వెంపలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

**సమ్మెలో కార్మికులు పాల్గొనాలి**

భీమవరం అర్బన్: నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేసి కార్మికుల పరిష్కారం కోసం ఈ నెల 20న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో సోమవారం ఈ నెల 20 సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, చిలకపాటి చిట్టి మేరీ, రామలక్ష్మి, లక్ష్మి నరసమ్మ, పంచాయతీ కార్మికులు సత్యనారాయణ, కడల శ్రీను, పెచ్చెట్టి ఏసు, తంగెళ్ల శ్రీరామ్ మూర్తి, చిలకపాటి యాకోబు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషి

**ఎమ్మెల్యే పులపర్తి, ఎమ్మెల్సీ కవురు**

భీమవరం అర్బన్: పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేద్దామని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. భీమవరంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. పలు శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరిగిన పనుల గురించి ఈ సందర్భంగా వివరించారు. ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారాక అధికారులు కూడా మారతారని, అధికారులు గ్రామ స్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో మురళీ గంగాధర్, సర్పంచ్‌లు కోళ్ల బాలకృష్ణ, ఆరేటి వెంకట సత్య వీరాస్వామినాయుడు, జుత్తిగ కనకదుర్గా వరప్రసాద్, ఎంపీటీసీ తిరుమాని తులసీరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, చిత్రంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

# పెదకాపవరానికి రెండు రంగ స్థల పురస్కారాలు





పురస్కారాలు అందుకుంటున్న గాదిరాజు చిన అప్పలరాజు, హేమ లక్ష్మీనారాయణరాజు

ఆకివీడు: రంగస్థలంపై రామాంజనేయ యుద్ధం నాటకంలో ఆంజనేయ పాత్రకు పాడిన పద్యానికి రంగస్థల సీనియర్ నటుడు గాదిరాజు చిన అప్పలరాజు, మాతృదేవోభవపై కవితా గానం వినిపించిన గాదిరాజు హేమ లక్ష్మీనారాయణరాజుకు ప్రత్యేక అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఏలూరులో ఆదివారం నిర్వహించిన ప్రపంచ రంగస్థల, తెలుగు సాహితీ సంబరాలు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకళా వేదిక నిర్వహించిన నాన్‌స్టాప్ కళా ప్రదర్శనలో 48 గంటల పాటు అప్పలరాజు రామాంజనేయ యుద్ధంలో పాడిన ఆంజనేయ పాత్ర పద్యం పలువురిని ఆకట్టుకుంది. అనంతరం కళాకారులిద్దరిని ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ ఆఫ్‌రికార్డు పురస్కారం, తానా బుక్ ఆఫ్‌రికార్డు పురస్కారం, కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డులలో అవార్డుల అర్హతకు పేర్లను ఎంపిక చేసి పంపించారని తెలిపారు. కార్యక్రమంలో కళా వేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, జాతీయ ప్రధానకార్యదర్శి టి.పార్థసారథి చేతుల మీదుగా ప్రసంశా పత్రం, షీల్డ్‌తో పాటు దుశ్శాలువా కప్పి సత్కరించారని చెప్పారు.

# భగ్గుమంటున్న భానుడు



ఎండ వేడిమికి నిర్మానుష్యంగా మారిన రహదారి

ఆకివీడు: రోహిణీ కార్తె దగ్గర పడటంతో భానుడి ప్రతాపం మరింత పెరిగింది. జనవరి నుంచి ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ప్రతి రోజూ 30 డిగ్రీల నుంచి 35 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రత ఉంటుంది. గ్రీష్మ తాపానికి ప్రజలు అల్లాడిపోతుంటే సోమవారం భానుడి భగ భగలకు మరింతగా ఉక్కిరి బిక్కిరయ్యారు. సోమవారం 38 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండగా 45 డిగ్రీల వేడిని తలపించిందని వాతావరణ శాఖ సూచించింది. మండుటెండలతో ప్రజలు బెంబేలెత్తిపోయి, సాయింత్రం ఆరు గంటల వరకూ ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితి నెలకొంది. ఎండ వేడికి వీస్తున్న వడగాలులకు వృద్ధులు, పిల్లలు తల్లడిల్లిపోతున్నారు. ఏసీలు, ఫ్యాన్ల కింద కూర్చున్నా ఫలితం దక్కడం లేదని ఆవేదన చెందుతున్నారు. కూల్ డ్రింకులు, జ్యూస్‌లు, కొబ్బరి బొండాలు, ముంజికాయలకు డిమాండ్ పెరిగింది.

# శోభాయమానంగా వెంకన్న రథయాత్ర



స్వామి వారి రథోత్సవం నిర్వహిస్తున్న పండితులు



రథోత్సవంలో ఏర్పాటు చేసిన కేరళ వాయిద్యాలు

కాళ్ల: కాళ్లకూరు గ్రామం గోవింద నామంతో మారుమోగింది. గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారి రథయాత్ర శోభాయమానంగా నిర్వహించారు. వేద మంత్రాల నడుమ పలు మేళతాళాలతో సుందరంగా అలంకరించిన రథంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. రథోత్సవంలో ఏర్పాటు చేసిన బుట్ట బొమ్మలు, శక్తి వేషాలు, తీన్మార్ డప్పులు, మేళతాళాలు, డీజే సిస్టం భక్తులను విశేషంగా ఆకర్షించాయి. రథోత్సవం సందర్భంగా జువ్వలపాలెం రహదారిలో ట్రాఫిక్ నియంత్రణకు కాళ్ల పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. రథోత్సవంలో దేవస్థానం ఈఓ ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది, భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# ఎక్సైజ్ అధికారుల దాడులు

భీమవరం: పట్టణంలోని ఉండి రోడ్డు రైల్వే గేటు వద్ద బెల్ట్ షాపు నిర్వహిస్తున్న పట్నాల సీతారాంబాబును సోమవారం అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు చెప్పారు. నిందితుడి వద్ద నుంచి 7 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడిలో ఎక్సైజ్ ఎస్ఐలు పి.ఉమామహేశ్వరరావు, పి.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

**ఆరు మద్యం సీసాలు స్వాధీనం**

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముద్దే శ్రీనును అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ వి.కరుణ ప్రియ, సిబ్బంది పాల్గొన్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు వివరించారు. అక్రమ మద్యం, సారా కేసుల్లో పట్టుబడిన ఆరు వాహనాలను ఈ నెల 17వ తేదీన ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వద్ద వేలం వేయనున్నట్లు సీఐ చెప్పారు.



భీమవరం: నిందితుడిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు



ఆకివీడు: స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

### ఘనంగా రథోత్సవాలు



ఉప్పలూరులో నిర్వహిస్తున్న చెన్నమల్లేశ్వరుని రథోత్సవం

ఉండి: ఉప్పులూరులో వేంచేసియున్న చెన్నమల్లేశ్వర స్వామి, ఉండిలో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని సోమవారం రథోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలు పెద్ద ఎత్తున కార్యక్రమాల్లో పాల్గొని రధాన్ని లాగారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు, కార్య నిర్వాహక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన కేశవస్వామి కల్యాణోత్సవాలు

యలమంచిలి: ఈ నెల 6న స్థానిక విష్ణాలయంలో వైకానస ఆగమ ప్రకారం ప్రారంభమైన శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి వార్ల కల్యాణోత్సవాలు సోమవారం రాత్రి జరిగిన దేవేరుల పుష్పోత్సవంతో ముగిసాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం అర్చకులు వాడపల్లి గోపి కృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో దేవేరులకు ఉదయం అర్చనలు, కుంకుమ పూజలు, పూర్ణాహుతి, చక్రస్నానం, కంకణ ఊరేగింపు, ఆలయ బలిహరణ, ధ్వజారోహణ చేసి సాయంత్రం పుష్పోత్సవం నిర్వహించారు.